## 17. ఖరీదైన బతుకు

బస్‌స్టాప్‌లో గంట నించి సిటి బస్ కోసం వేచి ఉన్న ఒకతను ఫోర్డ్ కారులో వెళ్తున్న ఓ ధనవంతుడ్ని చూసి మనసులో అనుకున్నాడు.

"నాకా కారుంటే బావుండేది."

బస్టాప్‌లో నిలబడ్డ ఓ యోగి వెంటనే 'తథాస్తు' అని దీవించాడు.

చిత్రంగా సామాన్యుడి ఆత్మ వెంటనే ఆ ఫోర్డ్ కారు యజమాని శరీరంలోకి మారింది. కారు యజమాని ఆత్మ బస్టాప్‌లోని అతని శరీరంలోకి వెళ్ళింది.

నాలుగైదు గంటల్లోనే సామాన్యుడికి ఆ ధనవంతుడి జీవితం అంటే రోత పుట్టింది. బ్లాక్‌మనీ దాచుకోవడంలో టెన్షన్, స్వంత ఆదాయం గల మాట వినని భార్య, వ్యాపారంలో పార్టనర్స్‌ని మోసం చేయడానికి పథకాలు, అధిక ఆహారం వల్ల, టెన్షన్స్ వల్లా బలహీనమైన శరీరం...

సామాన్యుడు బస్టాప్‌కి తిరిగివెళ్ళి, తన పాత జీవితం తనకిమ్మని ఆ యోగిని ప్రార్థించాడు.

"నీలా బస్సులో ప్రయాణించేవాడికి లేని ఎన్నో సమస్యలు, ఖరీదైన కార్లలో ప్రయాణించే వారికుంటాయి. అలాంటివాటికి ఆశ పడితే వాటినీ నువ్వు భరించాల్సివుంటుంది జాగ్రత్త." హెచ్చరించాడు యోగి.

## 18. భగవదానుభవం

"మీరు భగవంతుడ్ని చూసారా?"

"చూసాను."

"అయితే నాకూ చూపించండి..."

"ఇదేమిటి నా చెవిని నలుపుతున్నారు? అబ్బ! నొప్పి. అలా నలపకండి."